సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం ; 9 ; మే ; 2025





## అసంపూర్తిగా మినీ స్టేడియాలు

జిల్లాలోని పలు పట్టణాల్లో ఆరేళ్ల క్రితం మినీ స్టేడియాల నిర్మాణ పనులు చేపట్టగా.. ఇంతవరకు ఒక్కటీ అందుబాటులోకి రాలేదు. 10లో



## మళ్లీ తడిసిన ధాన్యం

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గురువారం ఉరుములు. మెరుపులతో కూడిన వర్షం కురవగా కల్లాల్లోని పంటలు తడిసి ముద్దయ్యాయి. 10లో

గరిష్టం / కనిష్టం
39° / 26°

## వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సుమనోహరం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

**పాల్వంచరూరల్ :** మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, హారతి సమర్పించిన అర్చకులు మంత్రపుష్పం పఠించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

### నేడు మంత్రి తుమ్మల పర్యటన

**ములకలపల్లి:** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ములకలపల్లి మండలంలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వపై సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన ప్రాంతాన్ని ఆయన పరిశీలిస్తారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలంమ తొట్టిపంపు గ్రామంలో ప్యాకేజ్-9 వద్ద జరుగుతున్న పనుల పురోగతి, ఆ తర్వాత యాతాలకుంట వద్ద చేపడుతున్న టన్నెల్ పనులను తుమ్మల పరిశీలించనున్నారు. యాతాలకుంట క్యాంప్ వద్ద 'సీతారామ' అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. కాగా, సీతారామ ప్రధాన కాలువ గైడ్‌వాల్‌కు రెండు చోట్ల పగుళ్లు ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తారా లేదా అనే విషయమై ఎలాంటి సమాచారం లేదు.

### ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**కొత్తగూడెంటౌన్:** జూన్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ సూచించారు. తన చాంబర్‌లో గురువారం కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీసి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు.

### నేటి నుంచి రెమిడియల్ టీచింగ్

**కొత్తగూడెంఅర్బన్:** పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు శుక్రవారం నుంచి రెమిడియల్(లోప నివారణ) బోధన ప్రారంభిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరా చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల వారీగా ఏ సబ్జెక్టులో ఎంత మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.. వారికి బోధనకు ఏ ఉపాధ్యాయుడిని కేటాయించామో తెలిపేందుకు గూగుల్ షీట్‌ను తయారు చేసి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించామని పేర్కొన్నారు. టీచర్ల వివరాలు గూగుల్ షీట్‌లో నమోదు చేయని ప్రధానోపాధ్యాయలపై చర్యలు తీసుకునేలా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కాగా, ఆయ ప్రధానోపాధ్యాయులు కూడా రెమిడియల్ టీచింగ్‌కు సరైన టైమ్ టేబుల్ రూపొందించుకోవాలని, వేసవి దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు.

### ఆరు నెలల పాటు సమ్మె నిషేధం

**సింగరేణి(కొత్తగూడెం):** సింగరేణిలో ఆరు నెలల పాటు సమ్మె నిషేధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేయగా.. సింగరేణి యాజమాన్యం గురువారం రాత్రి ఇదే విషయాన్ని ప్రకటించింది. రాష్ట్రంలోని అత్యవసర సర్వీసుల మెయింటెనెన్స్ యాక్ట్ 1971 (1971 కంపెనీ యాక్ట్-20) సెక్షన్‌లోని సబ్-సెక్షన్,(1), (3) కిందకు సింగరేణి సంస్థ వస్తున్నందున ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆరు నెలల పాటు సమ్మె నిషేధమని పేర్కొంది.

# తరుగు.. తంటాలు



సోములగూడెంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ**

- మిల్లర్ల మెలికతో 42.2 కేజీల చొప్పున కాంటా
- రైతులకు ధర చెల్లించేది 40 కిలోలకే..
- క్వింటాకు రూ.60 చొప్పున హమాలీ చార్జీల భారం



కొనుగోలు కేంద్రంలో 42 కిలోలకు పైగా తూకం వేసిన ధాన్యం బస్తా..

**పాల్వంచరూరల్ :** ఆరుగాలం శ్రమించి పండించిన యాసంగి ధాన్యాన్ని విక్రయించాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత లేదనే సాకుతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తరుగు పేరుతో దోపిడీకి గురవుతున్నారు. ఒక్కో బస్తాలో 42.2 కేజీల ధాన్యం తూకం వేసి, రైతులకు మాత్రం 40 కిలోలకే ధర చెల్లిస్తున్నారు. క్వింటా ధాన్యానికి సుమారు 5 కిలోల తరుగు తీస్తుండగా రైతులకు రూ.116 చొప్పున నష్టం వస్తోంది.

**23,400 మెట్రిక్ టన్నులు..**

జిల్లాలో 145 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా గురువారం నాటికి 3,273 మంది రైతుల నుంచి రూ.54.15 కోట్ల విలువైన 23,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. నిబంధనల ప్రకారం బస్తాకు 40 కిలోల తూకం వేయాలి. దీనికి 500 గ్రాములు తరుగు, 500 గ్రామం గన్నీ బస్తా కింద లెక్కవేసి 41 కిలోల వరకు వేస్తారు. కానీ కొన్ని కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు మెలిక పెట్టి అదనపు తూకంతో తమను దోపిడీ చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లు చెప్పినట్టుగా 42.200 కిలోల చొప్పున తూకం వేయకుంటే ధాన్యాన్ని లారీల నుంచి దిగుమతి చేసుకోకుండా జాప్యం చేస్తున్నారు. ధర మాత్రం 40 కిలోలకే చెల్లిస్తున్నారు. దీనికి తోడు క్వింటాకు రూ.60 చొప్పున హమాలీ చార్జీలు కూడా రైతుల నుంచే వసూలు చేస్తున్నారు.

**గత్యంతరం లేక అంగీకారం..**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాకు రూ.2,300, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 చెల్లిస్తారు. దీంతో పాటు సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ వస్తుందనే ఆశతో రైతులు ధాన్యాన్ని తీసుకొస్తుండగా అక్కడ నెలల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చాక తిరిగి బయటకు వెళ్లలేక అక్కడే అమ్మాల్సి వస్తోంది. తద్వారా క్వింటాకు 5 కిలోల మేర నష్టపోవాల్సి వస్తోంది.

**మిల్లర్లకు అనుకూల 'వాతావరణం'**

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలు మిల్లర్లకు అనుకూలంగా మారాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే తేమ శాతం, నాణ్యత పేరుతో సకాలంలో కాంటాలు వేయడం లేదు. దీనికి తోడు అదనపు తూకం వేస్తున్నారు. కాగా, ప్రస్తుత వాతావరణం నేపథ్యంలో వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తేమ శాతం పెరుగుతుందని, మొలకలు వచ్చే ప్రమాదం ఉందనే భయంతో తూకం ఎక్కువైనా సరే అమ్ముకుంటున్నారు. రైతుల భయం మిల్లర్లకు సానుకూలంగా మారుతోంది.

**58 క్వింటాళ్లు అమ్మాను..**



ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 58 క్వింటాళ్ల ధాన్యం విక్రయించా. బస్తాకు 2 కిలోలు అదనపు తూకానికి అంగీకరిస్తేనే కొంటామని చెప్పారు. తప్పని పరిస్థితుల్లో ఒప్పుకున్నా. దీంతో తరుగు పేరుతో సుమారు రూ.6 వేల వరకు నష్టపోయాను.

– తేనే శ్రీను, రైతు, సోములగూడెం

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో బస్తాకు 2 కిలోలకు పైగా తూకం వేయకూడదు. ఇది నిబంధనలకు విరుద్ధం. అలాంటి వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి

**మిల్లర్లపై చర్య తీసుకోవాలి**



300 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే బస్తాకు 2.200 కిలోల చొప్పున అదనంగా తీసుకున్నారు. అంత ధాన్యాన్ని తిరిగి ప్రైవేటు వ్యాపారుల వద్దకు తీసుకెళ్లలేక అక్కడే విక్రయించాను. అధికంగా తూకం వేయించే మిల్లర్లపై చర్య తీసుకోవాలి.

– శేఖర్, రైతు, సోములగూడెం

# మానవ వనరుల అభివృద్ధే లక్ష్యం



సభలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనరసింహ, వేదికపై డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

- వైద్య, ఆరోగ్య శాఖకు రూ.11,482 కోట్ల నిధులు
- రఘునాథపాలెంలో మెడికల్ కాలేజీ నిర్మాణాలకు శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల, పొంగులేటి

**ఖమ్మం అర్బన్:** మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, పకడ్బందీ చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రఘునాథపాలెంలో రూ.130 కోట్లతో నిర్మించే ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన సముదాయానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి అవసరమైన భూమి, నిధులు సమకూర్చడంలో మంత్రులు కీలక పాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం ఏటా సగటున వైద్య రంగానికి రూ.5,959 కోట్లు వెచ్చిస్తే, తాము ఒక్క ఏడాదిలోనే రూ.11,482 కోట్లు కేటాయించామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. అంతేకాక అంతర్జాతీయ ప్రమాణాలతో 58 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను రూ.11,600 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే, 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్న భట్టి, మరో 30 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని సూచించారు. ఏదేమైనా ఉద్యోగులను తాము కాపాడుకుంటామని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉద్యోగులకు ఏనాడు 15వ తేదీ లోపు జీతాలు ఇవ్వలేదని తెలిపారు.

**వైద్య రంగానికి ప్రాధాన్యత**

ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఖమ్మం మెడికల్ కళాశాలలో సీట్లు 150కి పెంచుతామని, జిల్లాలో 6 – 7 ప్రైమరీ హెల్త్ సెంటర్ల మంజూరుతో పాటు ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ కేటాయించనున్నామని చెప్పారు. వందనం, కొదుమూరు ప్రాంతంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. అలాగే, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాల శంకుస్థాపన ఆలస్యమైనా కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంల్లో వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా, ఖమ్మం సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, వైద్యారోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఐడీసీ ఎండీ ఫణీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూడీఐఎస్ఈ పోర్టల్‌లో నమోదు చేయాలి

**ఇంటర్ ఫలితాలపై సమీక్షలో కలెక్టర్ పాటిల్**



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతీ విద్యార్థి వివరాలను యూడీఐఎస్ఈ+ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్తీర్ణతలో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండడానికి గల కారణాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఇంటర్‌లో కూడా డిజిటల్ బోధన, ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలల్లో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతలు నిర్మించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కళాశాలల్లో ఎకరానికి ఐదు చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు, పోర్టల్‌లో నమోదైన సంఖ్యకు చాలా తేడాలున్నాయని, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో చర్చించాలని జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సతీష్‌కుమార్‌కు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఐఈఓ వెంకటేశ్వరరావు, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

**కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం**

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, పరిశ్రమల శాఖ జీఎం తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచ బ్యాంక్ సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ర్యాంప్ పథకానికి కాంట్రాక్ట్ పద్ధతిలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు www.nimsme.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లో పరిశ్రమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# రేపు 'గిరి సౌరజల' బోర్లు ప్రారంభం

**డిప్యూటీ సీఎం భట్టితో పాటు ముగ్గురు మంత్రుల రాక**

**చండ్రుగొండ:** మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఇందిర గిరి సౌరజల వికాస్ పథకం ద్వారా నిర్మించిన బోరుబావులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భట్టి విక్రమార్క బెండాలపాడులో పర్యటిస్తారని, ఈ సందర్భంగా జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య కూడా హాజరవుతారని తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, డీఈ రంగస్వామి, ఏటీడబ్ల్యూఓ చంద్రశేఖర్, రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, సీఐ ఇంద్రసేనారెడ్డి, నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఫజల్, బొర్రా సురేష్, ఎండీ ఇమ్రాన్, సురేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

# సుప్రభాత సేవలో మంత్రి పొంగులేటి



పొంగులేటి దంపతులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు, అర్చకులు

**భద్రాచలం :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి గురువారం తెల్లవారుజామున జరిగిన సుప్రభాత సేవలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన వీరికి అర్చకులు, ఈఓ రమాదేవి స్వాగతం పలికారు. ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. ఆ తర్వాత శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈఓ స్వామి వారి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దంపతులు, ఆలయ స్థానాచార్యులు స్థలశాయి, ప్రధానార్చకులు విజయరాఘవన్, కోటి రామస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దమ్మతల్లి సన్నిధిలో..**

**పాల్వంచరూరల్ :** మండలంలోని శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు గురువారం దర్శించుకున్నారు. అర్చకులు, ఈఓ పూర్ణకుంభంతో స్వాగతం పలకగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈఓతో కలిసి ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అడిషనల్ డీఎంహెచ్ఓ జి.సుకృత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లతో మంత్రి మాట్లాడుతూ..గొడవలు లేకుండా అమ్మవారికి, భక్తులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు.

# ముందస్తు.. అంతంతే

- మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్‌కు నామమాత్ర స్పందన
- రూ.64.08 కోట్ల డిమాండ్‌లో రూ.6.19 కోట్లే వసూలు
- ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో సత్తుపల్లిలో అత్యధికం



ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయం

**సత్తుపల్లిటౌన్:** మున్సిపాలిటీల్లో ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే అత్యధికంగా ఆస్తి పన్ను రాబట్టేలా రాష్ట్రప్రభుత్వం ఏటా మాదిరిగా ఐదు శాతం రాయితీతో ఈసారి కూడా ఎర్లీ బర్డ్ స్కీంను ప్రకటించింది. కానీ రాష్ట్ర పురపాలక శాఖ ప్రవేశపెట్టిన ఈ పథకానికి ఈసారి స్పందన అంతంత మాత్రంగానే లభించింది. ప్రధాన కూడళ్ల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేయగా.. పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించారు. కానీ గతంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక,. విచారణలో బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు నిమగ్నమవడంతో ఎర్లీబర్డ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించలేకపోయారు. దీంతో పన్నుల వసూళ్లపై ప్రభావం చూపింది.

**సద్వినియోగం చేసుకున్నారు..**

2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వడం ఎర్లీబర్డ్ పథకం ఉద్దేశం. ఏటా ఈ పథకం ద్వారా ఎక్కువ మొత్తం పన్ను రాబట్టేలా మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు కృషి చేస్తారు. కానీ ఈసారి పాలకవర్గాలు లేకపోగా.. అధికారులు ఇతర పని ఒత్తిడిలో పెద్దగా దృష్టి సారించలేదు. ఫలితంగా వసూళ్లలో వెనుకంజ వేసినట్లయింది. ఈసారి ఏప్రిల్ 30వ వరకే ఉన్న గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినా ఆశించిన స్థాయిలో పన్నులు వసూలవకపోవడం గమనార్హం.

| మున్సిపాలిటీ | పన్ను డిమాండ్ | చెల్లించిన యజమానులు | వసూలైన పన్నులు | శాతం |
|---|---|---|---|---|
| ఇల్లెందు | రూ.2.23కోట్లు | 1,384 | రూ.56 లక్షలు | 25.11 |
| సత్తుపల్లి | రూ.5.67 కోట్లు | 2,080 | రూ.1.42కోట్లు | 25.04 |
| మణుగూరు | రూ.2.35కోట్లు | 1,244 | రూ.43లక్షలు | 18.30 |
| మధిర | రూ.4.01 కోట్లు | 1,720 | రూ.65 లక్షలు | 15.85 |
| కొత్తగూడెం | రూ.12.87కోట్లు | 3,026 | రూ.1.40కోట్లు | 10.88 |
| వైరా | రూ.4.53కోట్లు | 828 | రూ.46 లక్షలు | 10.15 |
| పాల్వంచ | రూ.32.42కోట్లు | 3,153 | రూ.1.27కోట్లు | 3.92 |

**కొంచెం ఆశ.. ఇంకొంచెం నిరాశ**

ఎర్లీబర్డ్ పథకం అమలులో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇల్లెందు(శాతంలో) అగ్రస్థానాన నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 1,384 మంది రూ.56 లక్షలు చెల్లించారు. మొత్తం రూ.2.23 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్‌లో 25.11 శాతం వసూలైంది. ఇక సత్తుపల్లి 25.04 శాతం(రూ.1.42కోట్లు) తో ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థానాన నిలిచింది. మణుగూరు 18.30శాతం, మధిర 15.85శాతం, కొత్తగూడెం 10.88 శాతం, వైరా 10.15 శాతం, పాల్వంచ 3.92 శాతం మాత్రమే ముందస్తు వసూళ్లు నమోదయ్యాయి.

# నాణ్యమైన సేవలు అందించేలా..

- గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ
- జిల్లాలో తొలివిడత 40 మందికి అవకాశం



మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి

**చుంచుపల్లి:** పల్లె పాలనలో కార్యదర్శులే కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరు అన్ని అంశాల్లో పరిజ్ఞానం కలిగి ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఇప్పటికే దీనిపై జిల్లా నుంచి ఒక ఎంపీఓ, సెకండ్ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శితో పాటు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థకు చెందిన మరో ఇద్దరు మాస్టర్ ట్రైనీలు శిక్షణ పొందారు. వారితో గురు, శుక్రవారాల్లో జిల్లాలో ఎంపికైన కొన్ని పంచాయతీల కార్యదర్శులకు ఐడీఓసీలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు గురువారం జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి పర్యవేక్షణలో కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలకు గాను, 455 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఈ శిక్షణ కోసం ప్రతి మండలంలోని మూడు, నాలుగు పంచాయతీలను ఎంపిక చేయగా మొదటి విడతలో 40 మంది కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

**ఏయే అంశాలపైన..**

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామ సభల ప్రాముఖ్యత, మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించడం, సమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహించడం, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక బృందాలు, పౌర సమాజ సంస్థలతో సమన్వయంతో గ్రామ సభలను బలోపేతం చేయడం, మహిళా–స్నేహపూర్వక గ్రామ పంచాయతీలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత, బాలల సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన చట్టాలు వంటి అంశాలపై పూర్తిస్థాయిలో కార్యదర్శులకు అవగాహన కల్పించనున్నారు. ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలన ప్రాముఖ్యత, మహిళా గ్రామ సభలు, గ్రామసభ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి పాత్ర, వివిధ శాఖలు, స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాలపై తొలిరోజు గురువారం చర్చించారు.

# అవినీతి దందాపై ఉక్కుపాదం

**సింగరేణి(కొత్తగూడెం):** కార్మికులు కష్టపడి పనిచేస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. మెడికల్ బోర్డ్‌లో అన్‌ఫిట్ చేయిస్తామని, బదిలీ చేయిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని చెబుతూ అక్రమ వసూళ్లకు పాల్పడిన ఓ ఉద్యోగిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అవినీతికి పాల్పడే వారితో పాటు సహకారం అందిస్తున్న వారినీ వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. అవినీతికి బలైన బాధితులు సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియజేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, ఆధారాలు చూపించిన వారికి రూ.10వేలు పారితోషికంగా ఇస్తామని అధికారులు ప్రకటించారు.

## క్లుప్తంగా

### ప్రేమ విఫలమైందని యువతి ఆత్మహత్య


భూక్యా కల్యాణి (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించటంతో మనస్తాపానికి గురైన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. పెనుబల్లి మండలం బ్రహ్మళ్లకుంట గ్రామానికి చెందిన భూక్యా కల్యాణి(22) సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వర్తిస్తోంది. కొంత కాలంగా పెనుబల్లి మండలానికి చెందిన యువకుడిని ప్రేమిస్తుండగా, ఇటీవల ఆయన పెళ్లికి నిరాకరించాడని తెలిసింది. దీంతో సత్తుపల్లిలోని మసీద్ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఇంట్లో బుధవారం రాత్రి చీరతో ఉరి వేసుకు ని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కవిత తెలిపారు.

### చికిత్స పొందుతున్న యువకుడు మృతి

వైరారూరల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని గన్నవరానికి చెందిన శీలం ఉపేందర్‌రెడ్డి(31) మద్యానికి బానిస కాగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో 2వ తేదీన పురుగుల మందు తాగిన ఆయన ఖమ్మం ఆస్పత్రికి తరలింగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

**వీ.వీ.పాలెంలో వృద్ధుడు...**

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన చీటి కోటయ్య(79) అనారోగ్యంతో బాధపడుతూ గడ్డి మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స చేయించుకున్నా ఫలితం లేక మనస్తాపంతో బుధవారం గడ్డి మందు తాగాడు. ఈ విషయం గమనించిన బంధువులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోటయ్య కుమారుడు మల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

### ఆటో బోల్తా: కూలీలకు గాయాలు

కూసుమంచి: కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. కూసుమంచిలోని గంగాదేవి గుడి సమీపాన గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కూలీలు ట్రాలీ ఆటోలో మిర్చి ఏరేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా గంగాదేవి ఆలయ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఎనిమిది కూలీలకు గాయాలు కాగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే, అక్కడ సరైన చికిత్స అందక ఇబ్బందులు ఎదురయ్యాయని క్షతగాత్రులు వాపోయారు.

### లారీని ఢీకొని యువతికి..

వైరా: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువతి ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం పాతమున్సిపాలిటీ కార్యాలయంలోని లైబ్రరీ లో కాంట్రాక్ట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న అడపా భవాని వైరా మండలం గన్నవరంలో జరిగే స్నేహితురాలి వివాహానికి గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. వైరా బాలాజీనగర్ పాత శివాలయం సమీపాన ఆగిఉన్న లారీని వెన క నుంచి ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యా యి. స్థానికులు 108కు సమాచారం ఇచ్చినా అందుబాటులోకి రాకపోవడంతో అటుగా వస్తు న్న వైరా ఆర్‌ఐ ప్రసాద్, తదితరులు భవానీని తన కారులో వైరా పీహెచ్‌సీకి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అయితే, భవానీ ద్విచక్ర వాహనం కొనుగోలుచేసి మూడు రోజులే అయినట్లు తెలుస్తుండగా ఇంతలోనే ప్రమాదం జరగడం గమనార్హం.

### జాలరికి చిక్కిన అరుదైన చేప!


వలలో పడిన దెయ్యంబేరు చేప

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ఏటిలో జాలరికి అరుదైన చేప చిక్కింది. గ్రామానికి చెందిన ఉపేందర్ రోజుమాదిరిగానే ఏటిలో చేపల కోసం వల వేశాడు. అందులో అరుదైన చేప చిక్కింది. దీన్ని దెయ్యంబేరు చేప అంటారని, ఇవి ఎక్కువగా సముద్రంలో జీవిస్తాయని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

### పగటి పూట మూడు ఏసీ బస్సులు

సత్తుపల్లిటౌన్: వేసవి దృష్ట్యా సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు పగటి పూట మూడు రాజధాని ఏసీ బస్సులు నడిపిస్తున్నామని ఆర్టీసీ ఖమ్మం డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య తెలిపారు. గురువారం సత్తుపల్లి బస్టాండ్‌ను సందర్శించి మాట్లాడారు. పాల్వంచ, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి ప్రయాణికుల కోసం సత్తుపల్లి బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫాంపై షెడ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# అసంపూర్తిగా మినీ స్టేడియాలు

**2016లో నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం**

- ఇల్లెందులో ఎమ్మెల్యే చొరవతో అదనపు నిధులు
- అశ్వారావుపేట, మణుగూరు, పాల్వంచలో పనులు అంతంతే
- భద్రాచలంలో స్థలం కోసం ఎదురు చూపులు


ఇల్లెందులో నిర్మించిన మినీ స్టేడియం ప్రధాన భవనం


అసంపూర్తిగా నిలిపిన మరుగుదొడ్ల పనులు

ఇల్లెందు: ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మినీస్టేడియం నిర్మించాలని భావించిన ప్రభుత్వం 2016లో జిల్లాకు రూ. 2.65 కోట్లు కేటాయించింది. దీంతో ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేటలలో స్టేడియం పనులు చేపట్టారు. ఆరేళ్లు గడుస్తున్నా ఒక్క స్టేడియం కూడా అందుబాటులోకి రాలేదు. ఇల్లెందులో 80 శాతం పనులు పూర్తికాగా, పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేటలలో 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. నిధులున్నంత మేరకు పనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. కాగా కొన్ని క్రీడలకు స్టేడియాలను వినియోగించుకుంటున్నారు. భద్రాచలంలో స్థలం లేక నేటివరకు పనులు మొదలు పెట్టలేదు. ఇల్లెందులో సింగరేణి సీఈఆర్ క్లబ్ గ్రౌండ్‌లో నిధులున్నంతర వరకు పనులు చేపట్టి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకోవడంతో ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి రూ.1.56 కోట్లు అదనంగా మంజూరయ్యాయి. దీంతో పంచాయతీరాజ్ శాఖ టెండర్ ప్రక్రియకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిధులతో స్టేడియం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాకింగ్‌ట్రాక్, ఉడెన్ ఫ్లోర్, మరుగు దొడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. పాల్వంచ, మణుగూరు, అశ్వారావుపేటలలో మినీ స్టేడియాలకు అదనపు నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ ప్రభుత్వం పైసా కూడా ఇవ్వలేదు. మినీ స్టేడియాల నిర్మాణం పూర్తయితే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వాకింగ్ ట్రాక్ ఏర్పాటు జరుగుతుంది. టేబుల్ టెన్నిస్ కోర్టు, జిమ్, కబడ్డీ కోర్టు, షటిల్ కోర్టు కూడా అందుబాటులోకి వస్తాయి. దీంతో క్రీడాకారులు నిత్యం ప్రాక్టీస్ చేస్తూ క్రీడా నైపుణ్యం మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుంది.

**టెండర్ ప్రక్రియ జరగాలి**



ప్రభుత్వం క్రీడాశాఖ ద్వారా విడుదల చేసిన నిధులు సరిపోలేదు. దీంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నిధులు కేటాయించారు. పనులను పీఆర్‌శాఖకు అప్పగించారు. మరో నాలుగు నెలల్లో స్టేడియం పూర్తికావొచ్చు.

– పరంధామరెడ్డి, డీవైఎస్‌ఓ

**ప్రతిభ చాటే అవకాశం**



స్టేడియాలు అందుబాటులోకి వస్తే క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవచ్చు. ఇండోర్ స్టేడియం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. కబడ్డీ, షటిల్ కోర్టు కూడా ఇందులో ఉండనున్నాయి. శిక్షితులైన కోచ్‌లు కూడా ఉంటారు.

– కబ్బాకుల రవి, టీచర్, ఇల్లెందు

**పనులు చేపట్టాలి..**



మినీ స్టేడియం కోసం రూ.1.90 కోట్లు అవసరమని అంచనా రూపొందించగా రూ.1.56 కోట్లు ఇచ్చారు. టెండర్ ప్రక్రియకు సుమారు నెల రోజులు పడుతుంది. ఆ తర్వాత పనులు చేపట్టి పూర్తి చేస్తాం..

– జి.రాజు, పీఆర్ ఏఈ, ఇల్లెందు

## డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల్లో 2, 4, 6వ సెమిస్టర్లు, బ్యాక్‌లాగ్ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షల టైంటేబుల్ ప్రకటించారు. ఈమేరకు వివరాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, వెంకటయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు.

**సెమిస్టర్ల వారీగా పరీక్షలు ఇలా..**

రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14, 16, 19, 21, 23, 26, 28, 30వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 15, 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నారు. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 14, 16, 19, 21, 23, 26, 28, 30, జూన్ 3, 5, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. ఇక మొదటి సెమిస్టర్ పరీక్షలను జూన్ 17, 18, 20, 21, 23, 24, 25వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు జూన్ 16, 17, 18, 19, 20, 21, 23, 24, 25 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 17, 20, 22, 24, 27, 29, 31, జూన్ 4, 10, 11, 12, 13, 16వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు.

### మిర్చి దగ్ధం


దగ్ధమవుతున్న మిర్చి

పినపాక: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గురువారం మిర్చి, వ్యవసాయ పనిముట్లు దగ్ధమయ్యాయి. సీతంపేట గ్రామానికి చెందిన రైతు గుండారపు మల్లయ్య బోటిగూడెం గ్రామంలో మిర్చి సాగు చేస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిచడంతో కల్లంలో ఉన్న మిర్చి, తోట, రూ.50,000 విలువైన సాగునీటి పైపులు దగ్ధమయ్యాయి. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

### పేకాటరాయుళ్లు అరెస్ట్

పినపాక: పేకాట ఆడుతున్న 12 మందిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని దోమెడ, పిట్టతోగు గ్రామాల మధ్య పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని, రూ. 3.11 లక్షల నగదు, 11 ద్విచక్ర వాహనాలు, కారు, 12 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పేకాట రాయుళ్లు పరారయ్యారు. కేసు నమోదు చేసినట్లు చేశామని ఈ.బయ్యారం ఎస్‌ఐ రాజ్ కుమార్ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## వేలంపాటలో రూ.5.21లక్షల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయంలో వివిధ పనులకు గురువారం వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యాన దుకాణాల సముదాయం కేటాయింపు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం, టెంట్ సామగ్రి అద్దెకు ఇచ్చేందుకు వేలం నిర్వహించగా, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు గుగులోతు నవీన్ రూ.15,500తో దక్కించుకున్నారు. అలాగే, షాపులు ఒక్కొక్కటి గత ఏడాది రూ.28,800కి ఇవ్వగా, ఈసారి రూ.31,800 ధర పలికాయి. తద్వారా ఆరు షాపుల ద్వారా రూ.1,90,800, టెంట్ సామగ్రి సరఫరాను గుగులోతు దస్రు రూ.3.15లక్షలతో దక్కించుకున్నాడు. మొత్తంగా రూ.5,21,300 ఆదాయం నమోదైందని ఈఓ వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఏడుగురి అరెస్టు

**5.5 కేజీల గంజాయి సీజ్**


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు తదితరులు

అశ్వారావుపేటరూరల్: నిషేధిత గంజాయి రవాణా చేస్తున్న, తాగుతున్న ఏడుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ పి.నాగరాజు రెడ్డి వివరాలు వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని బీసీఎం రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఎస్సై టీ యయాతి రాజు, సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఊట్లపల్లి వైపు నుంచి మూడు బైక్‌లపై అశ్వారావుపేట వైపు వెళ్తున్న ఏడుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో నిలిపి తనిఖీలు చేశారు. దీంతో వారి వద్ద రూ.2.75 లక్షల విలువైన 5.5 కేజీల గంజాయి లభ్యమైంది. మూడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. విచారణ చేపట్టి నిందితులు, అశ్వారావుపేటకు చెందిన షేక్ ఫిరోజ్ ఖాన్, గండికోట ప్రభుకుమార్, పసుపులేటి గోపింద్(శ్రీను), ఏపీలోని జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన పుట్టా జగదీష్, గుంటూరు జిల్లా శావల్యాపురం మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన ఆవుల సుధీర్ రెడ్డి, ఎన్‌టీఆర్ జిల్లా కంకిపాడు మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన తిరువీధుల కార్తీక్, హైదరాబాద్‌లోని చంపాపేట్ ప్రాంతానికి చెందిన బుల్లా సంజయ్‌లను అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గంజాయి వ్యాపారి రాము పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్సై రామ్మూర్తి, ట్రైనీ ఎస్సై అఖిల, సిబ్బంది నాగేంద్రరావు, హరిబాబు, కృష్ణ ప్రసాద్, పీ రమేష్‌రావు, రామకృష్ణ, నరేష్‌బాబు, ఎం భానుచందర్, ఎన్.వెంకటేశ్వరరావు, టీ సంతోష్ పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసు నమోదు

ములకలపల్లి: మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన వివాహిత ఆంగోతు సుభద్రను అదే గ్రామానికి చెందిన ఎల్లబోయిన నవీన్ అనే వ్యక్తి కొంతకాలంగా లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె హెచ్చరించింది. ఈ క్రమంలో ఆగ్రహంతో నవీన్ గత నెల 30న కిరణా సరుకుల కోసం దుకాణానికి వెళ్లిన సుభద్రను వెంబడించి, బూతులు తిట్టాడు. భర్తకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### నారవేప కలప స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న నారవేప కలప

ములకలపల్లి: అడవిలో నరికి పడేసిన భారీ నారవేప మొద్దును గురువారం అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) రవికిరణ్ కథనం ప్రకారం.. ములకలపల్లి బీట్ పరిధిలోని రాజాపురం, కమలాపురం మధ్య పోడు భూముల శివారు అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నారవేప మొద్దును నరికి పడేశారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించి మొద్దును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. కలపను పాల్వంచ డిపోకు తరలించారు. కలప విలువ 1.60 లక్షల విలువ ఉంటుందని ఎఫ్ఆర్ఓ తెలిపారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి


హచ్చా మృతదేహం

ఇల్లెందు: చేపల వేటకు వెళ్లిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇల్లెందులపాడు చెరువులో పడి మృతి చెందాడు. ఇల్లెందుల చెరువు కట్ట ఏరియా నెహ్రూనగర్‌కు చెందిన డి. హచ్చా(60) గురువారం మరొకరితో కలిసి తాగునీటి చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో జారి చెరువులో పడిపోయి బురదలో కూరుకుపోయాడు. గమనించిన సహచరుడు కాపాడే ప్రయత్నం చేశాడు. బురదలో నుంచి వెలికితీసి ఇల్లెందు ఏరియా ఆస్పత్రికి తరలించాడు. అయితే అప్పటికే హచ్చా మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

ఖమ్మంఅర్బన్: అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఖమ్మంలోని ధంసలాపురం వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా ఎర్రబోడు కాలనీకి చెందిన చేపూరి వెంకన్న(35) ఆటో డ్రైవర్ జీవనం సాగిస్తున్నాడు. మహబూబాబాద్ నుండి చింతకాని మండలం నామవరంలోని బంధువుల ఇంటికి శుక్రవారం ఆయన ఆటోలో వస్తుండగా, ఖమ్మం – బోనకల్లు రోడ్డులోని ధంసలాపురం ఫ్లైఓవర్ దాటాక ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో బ్రేక్ వేయగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే, ఆటోలో ఉన్న మహేష్, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. కాగా, వెంకన్న మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన మార్చురీకి తరలించగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

### ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష

భద్రాచలంఅర్బన్: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గురువారం భద్రాచలం ప్రథమశ్రేణి కోర్టు న్యాయమూర్తి శివనాయక్ తీర్పు చెప్పారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన యారం కోటిరెడ్డి వరకట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆయన భార్య లక్ష్మి 2016లో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి కోర్టులో చార్జీషీట్‌ను దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి ముద్దాయికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

### విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

గుండాల: మేతకు వెళ్లిన ఓ దుక్కిటెద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మేతకు వెళ్లిన మండల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీనుకు చెందిన దుక్కిటెద్దు గురుకుల పాఠశాల ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌లైన్ తగిలి విద్యుదాఘాతానికి గురైంది. ఎద్దు మృతితో సుమారు రూ.50 వేలు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.


సుజాతనగర్: తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు


ఇల్లెందురూరల్: అకాల వర్షంతో తడిసిన మక్కలు

# మళ్లీ తడిసిన ధాన్యం

**అకాల వర్షంతో రైతుకు మనోవేదన**


జూలూరుపాడు: ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు


పాల్వంచ: చెట్ల కొమ్మలు తొలగిస్తున్న స్థానికులు

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షాలు రైతును మనోవేదనకు గురిచేస్తున్నాయి. గురువారం జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. చండ్రుగొండలో ధాన్యం కాపాడుకునేందుకు రాశులపై కప్పిన పట్టాలు గాలికి ఎగిరిపోయాయి. తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిసి ముద్దయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులతో అక్కడక్కడా పిడుగులు పడ్డాయి. జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొంతమేర తడిసిపోయింది. ఇల్లెందు మండలంలో కల్లాలు, రహదారులపై ఆరబెట్టిన మక్కలు పూర్తిగా తడిసిపోయాయి. సుజాతనగర్ మండలంలో సొసైటీ కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. కేంద్రంలో తూర్పార బట్టి ధాన్యం 2 లారీలు, ఆరబెట్టిన ధాన్యం సుమారు 50 లారీల వరకు ఉంటుంది. ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ధాన్యం పూర్తిగా తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాంటాల్లో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈదురుగాలులకు పాల్వంచ బస్టాండ్ రోడ్‌లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో స్థానికులు కొందరు చెట్ల కొమ్మలను తొలగించారు.

# భయపెడుతున్న పిడుగుపాటు

**జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకు ప్రమాదం**

చుంచుపల్లి: ఇటీవల జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల పిడుగులు కూడా పడుతున్నాయి. పశువులు, మేకలు అక్కడక్కడా మృత్యువాత పడుతున్నాయి. ఈ నెల 1న పాల్వంచ మండలం ఉల్వనూరు వద్ద పిడుగుపడి మేక మృతి చెందింది. 4న ములకలపల్లి మండలం చలమన్న నగర్‌లో పిడుగుపాటుతో పర్సిక సీతయ్య పూరిల్లు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం భద్రాచలం, ములకలపల్లి, సారపాక, ఇరవెండి ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. పిడుగు పడితే ప్రాణాలు కోల్పోవడం, గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు కూడా వినిపించక పోవడం వంటి ప్రమాదాలు ఏర్పడతాయి. అయితే జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించాలి**

సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపైనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. వర్షాల సమయంలో ఎత్తైన ప్రదేశాలకు, చెట్ల కిందకు, సెల్‌టవర్లు, స్తంభాలు, కొండలు వద్దకు వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్న సమయంలో చెవులు మూసుకుని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్త పడాలి. ఉరుములు, మెరుపుల సమయంలో విద్యుత్ మోటార్ల వద్ద పనులు చేయొద్దు. విద్యుత్తు నియంత్రికలకు దూరంగా ఉండాలి. మొబైల్ ఫోన్ వాడొద్దు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, గేమ్ సిస్టమ్‌లు, కరెంట్ స్టవ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించొద్దు. గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి. ముఖ్యంగా పొలాల్లో పని చేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం లాంటివి చేయొద్దు.

# కొబ్బరి చెట్లపై పిడుగులు


భద్రాచలంలో పిడుగుపాటుతో కాలుతున్న చెట్టు

ములకలపల్లి: ఒకే కాలనీలో రెండు వేర్వేరు చోట్ల కొబ్బరి చెట్లపై పిడుగులు పడటంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలోని విజయపురి కాలనీకి చెందిన కొయ్యల వీరయ్య, పొన్నూరి హరి ఇళ్లలో కొబ్బరిచెట్లపై పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు కొయ్యల వీరయ్య కుటుంబీకులు సంధ్య, భార్గవి, కార్తీక్, పల్లవి, పక్కింటిలోని బీబినేని సతీష్, మరియమ్మ దంపతులతోపాటు చిన్నారులు శివ, కృప స్పృహ కోల్పోయి, కొద్దిసేపటికి తేరుకున్నారు. ఇంట్లోని విద్యుత్ మీటర్‌తోపాటు, ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయాయి.

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. భారీ వర్షంతో సుమారు రెండు గంటల పాటు విద్యుత్‌తో పాటు ఇంటర్‌నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది.